సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న మాజీ సర్పంచ్, కౌన్సిలర్లు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి చెందిన ఇద్దరు లబ్ధిదారులకు శనివారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను మున్సిపల్ నాయకులు అందజేశారు. పట్టణానికి చెందిన లబ్ధిదారులు శ్రీనివాస్‌రెడ్డికి రూ.42 వేల చెక్కు, విజయలక్ష్మికి రూ.45 వేల చెక్కును మాజీ సర్పంచ్ మద్దుల శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు జైపాల్‌రెడ్డి, బాలరాజ్, హేమంత్‌రెడ్డి, నాయకులు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో అందజేశారు.

ఆలయ 17వ కల్యాణ వార్షికోత్సవాలు



కీసర: నాగారం మున్సిపల్ పరిధిలోని రాంపల్లిలో కొలువైన శ్రీ సీతారామాంజనేయస్వామి ఆలయ 17వ కల్యాణ వార్షికోత్సవ వేడుకలను శనివారం దేవస్థానం చైర్మన్ రామారం నర్సింహ్మాగౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున రాంపల్లి ప్రజలు స్వామివారి 17వ కల్యాణ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంపల్లికి చెందిన గండి అంజయ్యగౌడ్, పెంటయ్యగౌడ్, రామారం గిరిగౌడ్ భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

తెరుచుకున్న అయ్యప్ప ఆలయం



ఆలయంలో హోమం నిర్వహిస్తున్న గురుస్వాములు

మేడ్చల్: మండల కాలం పాటు నిత్యం పూజలు జరిగే మేడ్చల్ అయ్యప్ప ఆలయం శనివారం తెరుచుకుంది. ప్రతీ సంవత్సరం నవంబర్ నెల నుంచి జనవరి వరకు తెరుచుకునే ఆలయం శనివారం గురుస్వాములు తెరిచారు. ఆలయ గురుస్వామి రాజేశ్వరగుప్తా గురుస్వామి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఆలయంలో మొదటి రోజు గణపతి హోమం నిర్వహించి పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. ఆలయంలో అయ్యప్ప మూలమూర్తికి, గణపతి, సుబ్రమణ్యస్వామి, నాగరాజులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జనవరి 21 వరకు ఆలయంలో పూజలు నిర్వహిస్తారు. శనివారం నుంచి ఆలయం మూసే వరకు భక్తులకు అన్నదానం చేస్తారు.

డిసెంబర్‌లోపు ఎల్ఆర్ఎస్-2020 పూర్తి చేసేందుకు చర్యలు



సమావేశంలో మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి తదితరులు

కీసర: నాగారం మున్సిపల్ పరిధిలో డిసెంబర్ నెలాఖరులోపు ఎల్ఆర్ఎస్-2020 పక్రియను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టనున్నట్లు మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం నాగారం మున్సిపల్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్-2020 పక్రియకు సంబంధించి టౌన్ ప్లానింగ్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మట్లాడుతూ.. ప్రభుత్వ, హెచ్ఎండీఏశాఖ ఆదేశానుసారం ఎల్ఆర్ఎస్ 2020లో భాగంగా మున్సిపల్ పరిధిలోని దరఖాస్తులు పరిశీలన పక్రియ వేగవంతం చేయుటకు తగు సూచనలు, సలహాలు అందజేశారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ చంద్రశేఖర్, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులకు మహర్దశ..

ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ పట్టనుంది. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు సర్కారు అనేక చర్యలు చేపడుతోంది. బడుల్లో విద్యార్థులకు మధ్యాహ్నం భోజనాన్ని వడ్డించి, ఏక రూప దుస్తులను అందజేస్తున్న సర్కారు ఆంగ్ల విద్యను ప్రవేశపెట్టింది. బడులను బాగుచేయాలన్న లక్ష్యంలో భాగంగా మన ఊరు-మనబస్తీ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల కింద మౌలిక వసతులను కల్పించింది. ప్రభుత్వం పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణ బాధ్యతను అమ్మ ఆదర్శ కమిటీలకు అప్పగించి, నెలకు రూ.39 లక్షలు అందచేస్తోంది. అలాగే, బడులకు ఉచిత కరెంట్ సరఫరా చేస్తోంది. దీంతో మేడ్చల్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు పరిశుభ్రత, పచ్చదనంతో కళకళలాడుతున్నాయి.

సాక్షి,సిటీబ్యూరో



మనఊరు- మన బడి కింద 150 పాఠశాలల్లో పూర్తయిన పనులు

- బడుల్లో అదనపు గదులు, మౌలిక వసతుల కల్పన
- అమ్మ ఆదర్శ కమిటీల అధ్వర్యంలో 286 బడుల్లో అత్యవసర పనులు
- పారిశుద్ధ్య నిర్వహణకు నిధులతో సహా విద్యుత్తు బిల్లులు

కార్పొరేట్‌కు దీటుగా

మన ఊరు-మనబస్తీ-మన బడి కింద సర్కారు బడులను కార్పొరేటు దీటుగా తీర్చిదిద్దారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అవసరం ఉన్నచోట భవనాలు, అదనపు గదులు, డైనింగ్ హాళ్లు, మూత్రశాలలు, ప్రహరీల నిర్మాణాలు, విద్యుత్తు సౌకర్యం, తాగునీటి వసతి, రంగులు వేయడం, గ్రీన్ బోర్డులు, మరమ్మతులన్నీ పూర్తి చేశారు. 182 ప్రభుత్వ పాఠశాలల్లో 12 రకాల సమస్యల్ని గుర్తించిన యంత్రాంగం 150 బడుల్లో రూ. 65 కోట్ల నిధుల కేటాయింపుతో అభివృద్ధి పనులకు జిల్లా విద్యాశాఖ చేపట్టింది. మరుగుదొడ్లు, ప్రహరీ గోడలు, వంట గదులు, భోజనశాలలు వంటి నిర్మాణాలను ఉపాధి హామీ పథకంలో చేర్చగా, భవనం మరమ్మతులు వంటి వాటి కోసం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నియోజకవర్గం, జిల్లా అభివృద్ధి నిధులను వినియోగించేలా చర్యలు తీసుకున్నారు. నీటి వసతి తదితర మౌలిక వసతులు, స్థానిక అవసరాల కోసం కూడా నిధులు కేటాయించారు. ఇందులో పాఠశాల యాజమాన్య కమిటీలు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక సంస్థల ప్రతినిధులను భాగస్వామ్యం చేసింది.

బడులకు ఉచిత వెలుగులు



ప్రభుత్వ విద్యాసంస్థలకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నారు. దీంతో ప్రాథమిక తరగతుల నుంచి డిగ్రీ, సాంకేతిక కళాశాలలకు ప్రయోజనం చేకూరుతోంది. దీని కోసం విద్యుత్ పంపిణీ సంస్థ ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేసింది. విద్యా సంస్థలు ఏ శాఖ పరిధిలోకి వస్తే ఆ శాఖ ఉన్నతాధికారికి పోర్టల్ లాగిన్ సదుపాయం కల్పించారు. శాఖ పరిధిలోని విద్యా సంస్థల వివరాలను వెబ్ పోర్టల్‌లో చేర్చడం, తొలగించడం, సవరణకు అవకాశం కల్పించారు. ఉచిత విద్యుత్ నేపథ్యంలో వచ్చిన విద్యుత్ బిల్లును విద్యా సంస్థలు చెల్లించకుండా సంబంధిత శాఖల ఉన్నతాధికారులు ఆ శాఖకు ప్రతి నెలా డిస్కమ్‌లకు చెల్లిస్తున్నారు. ఇందుకు వీలుగా పోర్టల్‌ను రాష్ట్ర ఆర్థిక శాఖతో అనుసంధానించారు. ఈ లెక్కన ప్రభుత్వ విద్యా సంస్థలకు రూ. లక్షల్లో ఆర్థిక భారం తప్పింది. మేడ్చల్ జిల్లాలో 507 ప్రభుత్వ పాఠశాలలు, 3 డిగ్రీ, 5 జూనియర్ కళాశాలలు, ఒక ఒకేషనల్ కళాశాల, స్పోర్ట్స్ అథారిటీ కళాశాల, 6 సాంఘీక సంక్షేమ కళాశాలలు, 2 గిరిజన సంక్షేమ కళాశాలలు, 6 మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ సంక్షేమ కళాశాలలు, 8 మైనార్టీ సంక్షేమ కళాశాలలకు ఉచిత విద్యుత్ వసతి లభిస్తోంది.

286 బడుల్లో రూ. 12 కోట్లతో అత్యవసర పనులు

మేడ్చల్ జిల్లాలో 286 ప్రభుత్వ బడుల్లోనే 'అమ్మ ఆదర్శ పాఠశాల' కమిటీల పర్యవేక్షణలో అత్యవసర పనులను రూ.12 కోట్లతో చేపట్టారు. మౌలిక వసతుల కల్పన లక్ష్యంగా పది రకాల అత్యవసర పనులను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో పంచాయతీరాజ్, విద్యుత్తు, ఆర్అండ్‌బీ, ఈడబ్ల్యూఐడీసీ, టీఎస్ఈడబ్ల్యూ, ఓడీసీ విభాగాల ఇంజనీరింగ్ శాఖలు పూర్తి చేశాయి. జిల్లాలో 15 మండలాల పరిధిలోని 286 ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు గుర్తించిన 699 అత్యవసర (ఎమర్జెన్సీ) పనులకు ప్రభుత్వం రూ.12,01,51,500 ఖర్చు చేసింది. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పర్యవేక్షణలో ప్రభుత్వ పాఠశాలలో అత్యవసర పనులైన విద్యుత్, తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, ఇతరత్రా మేజరు, మైనర్ మరమ్మత్తులు చేపట్టారు.

పారిశుద్ధ్యానికి ప్రత్యేక నిధులు

ప్రభుత్వ బడుల్లో పారిశుద్ధ్య నిర్వహణకు సర్కారు ప్రత్యేక నిధులు అందజేస్తోంది. దీంతో గ్రామ పంచాయతీ, పురపాలక పారిశుద్ధ్య సిబ్బందికి ఉపశమనం లభించింది. ప్రత్యేక నిధులను నేరుగా అమ్మ ఆదర్శ కమిటీ సభ్యుల ఖాతాలో జమ అవుతున్నాయి. 3 నెలల నిధులను ముందే వారి ఖాతాలలో జమ చేసేలా విద్యాశాఖ చర్యలు తీసుకుంటోంది. మేడ్చల్ జిల్లాలో మొత్తంగా 507 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, ఇందులో 96,284 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. దీంతో పాఠశాల పరిసరాలను అందంగా ఉంచటంతోపాటు మరుగుదొడ్లను శుభ్రపరచటం, మొక్కలకు నీళ్లు పెట్టడం తదితర పనుల్ని నిర్వహిస్తున్నారు. పాఠశాలల్లో శుభ్రత కోసం అవసరమైన వస్తువులకు కూడా సమగ్ర శిక్ష నిధులను వెచ్చిస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతంతో మంచి ఆదరణ



కరోనా కష్టకాలం నుంచి ప్రభుత్వ బడులకు ఆదరణ పెరిగింది. సర్కారు విద్య బలోపేతానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలతో తమ పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తిని చూపుతున్నారు. ఆంగ్ల విద్య ప్రవేశంతోపాటు మధ్యాహ్న భోజనం, ఏక రూపు దుస్తుల పంపిణీ, మన బడి-మనబస్తీ-మన ఊరు, అమ్మ ఆదర్శ కమిటీలతో బడుల్లో మౌలిక వసతులు కల్పన వంటి పనులు సర్కారు పాఠశాలలకు ఆదరణ పెంచింది. సీఎస్ఆర్ నిధులతో బడుల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. పారిశుద్ధ్య నిర్వహణ, ఉచిత కరెంట్ సరఫరా వంటి కార్యక్రమాలు ప్రభుత్వ విద్య మరింత బలోపేతం చేస్తోంది. బడిబాటలో భాగంగా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది.

– మేడ్చల్ జిల్లా, డీఈఓ. విజయకుమారి.

దేశ భవిష్యత్తు నిర్మాణంలో ఐఏఎస్ పాత్ర కీలకం



స్టడీ మెటీరియల్ విడుదల చేస్తున్న ఐఏఎస్ అకాడమీ వ్యవస్థాపక చైర్మన్ కృష్ణ ప్రదీప్

మేడ్చల్‌రూరల్: దేశ భవిష్యత్తు నిర్మాణంలో బ్యూరోక్రాట్లు కీలకపాత్ర పోషిస్తారని, ప్రధాని కూడా తన ప్రణాళికల అమలులో ఐఏఎస్ అధికారులపై ఆధారపడతారని 21 సెంచరీ ఐఏఎస్ అకాడమీ వ్యవస్థాపక చైర్మన్ కృష్ణ ప్రదీప్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు సివిల్స్ సాధనపై అవగాహన సదస్సు నిర్వహించారు. మొదటి ప్రయత్నంలో సివిల్ సర్వీస్ పరీక్షను క్లియర్ చేయడం ఎలా అనే అంశంపై సదస్సు నిర్వహించి విద్యార్థులకు కీలకమైన మార్గదర్శనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సివిల్ సర్వీస్ పరీక్ష విజయానికి సాధారణ విద్యార్థులు కూడా సరైన కృషితో అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చన్నారు. అకాడమీ చీఫ్‌మెంటర్ భవాని శంకర్ మాట్లాడుతూ.. విద్యార్థులు యూపీఎస్సీ సిలబస్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం ప్రత్యేక స్టడీ మెటీరియల్స్ విడుదల చేసి లైబ్రరీలో విద్యార్థుల కోసం అందుబాటులో ఉంచారు. సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ రామస్వామి రెడ్డి, గిరిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు, ఉపాధ్యాయుల కార్తీక వనభోజనాలు



ఉపాధ్యాయుల కార్తీక పూజలు

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి అత్వెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులు, ఉపాధ్యాయులు కార్తీక వనభోజనాలు చేశారు. ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలో కార్తీక పూజలు చేయగా అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి వనభోజనాలు చేశారు. హెచ్ఎం మాణిక్యాలరావు, ఉపాధ్యాయులు నవీన్, పద్మలత, వసీం, రంగారావు, రాంబాబు, ప్రభాకర్, రీతు, విజయలక్ష్మి, సోని, మంజుల, విద్యార్థులు పాల్గొన్నారు.

వయో వృద్ధుల పరిరక్షణ చట్టంపై అవగాహన సదస్సు

మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లిలో గల ప్రభుత్వ పాఠశాలలో వయో వృద్ధుల కోసం చట్టంలో ఉన్న హక్కుల పరిరక్షణ చట్టంపై న్యాయమూర్తులు అవగాహన కలిపించారు. ఐసీఎఫ్ఐలా స్కూల్ లీగల్ ఎయిడ్ సొసైటీ, ఐఎఫ్‌హెచ్ఈ ఆధ్వర్యంలో వయోవృద్ధు హక్కుల పరిరక్షణ అవగాహన సదస్సును నిర్వహించారు. న్యామూర్తులు, న్యాయవాదులు, అధికారులు పాల్గొని చట్టం గురించి వివరించారు. అదనపు జిల్లా సెషన్స్ జడ్జి లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జీవన్‌కుమార్, 9వ మెట్రోపాలిటన్ జడ్జి దీలీప్ కుమార్, స్కూల్ డీన్ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి పాల్గొని చట్టం గురించి వివరించారు. సీనియర్ సిటిజన్ యాక్ట్, వెల్ఫేర్ ఆఫ్ పెరెంట్స్, మెయింటనెన్స్ వంటి అంశాలపై అవగాహన కలిపించారు. వయో వృద్ధుల కోసం రూపొందించిన పోస్టర్‌ను విడుదల చేశారు.



నాగారం మున్సిపల్ అభివృద్ధికి కృషి

కీసర: నాగారం మున్సిపాలిటీ అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయడం జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని 3వ వార్డులోని సుచిత్రకాలనీలో సుమారు రూ. 15 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ఆయన మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్‌తో కలిసి ప్రారంభించి, వివిధ వార్డులో ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. కౌన్సిలర్ కళావతి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ అభివృద్ధికి పార్టీలకతీతంగా కృషి చేయాలి



సమావేశంలో ఎంపీ ఈటెల రాజేందర్, మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి తదితరులు

కీసర: నాగారం మున్సిపాలిటీ అభివృద్ధికి పార్టీలకతీతంగా కృషి చేయాలని మేడ్చల్-మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు. శనివారం నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్లచంద్రారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరానికి అతిచేరువలో ఉన్న నాగారం మున్సిపాలిటీ కాలనీల పరంగా శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. అంతేకాకుండా కాలనీల్లో నివసిస్తున్న ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్తున్న మున్సిపల్ పాలకవర్గం సభ్యులతోపాటు, మున్సిపల్ అధికారులను ఆయన అభినందించారు. మున్సిపల్ అభివృద్ధికి తన వంతుగా కేంద్ర ప్రభుత్వం నుంచి కూడా నిధులు మంజూరయ్యే విధంగా కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు. మున్సిపల్ పరిధిలోని 20 వార్డుల్లో రూ. 7.8 కోట్ల మున్సిపల్ నిధులతో సీసీరోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులు చేపట్టాలని సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో కమిషనర్ భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్లు, వాటర్ బోర్డు మేనేజర్, విద్యుత్‌శాఖ సిబ్బంది, ఇతర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

టీజీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్స్ ప్రారంభం

ఘట్‌కేసర్: టీజీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో ఘట్‌కేసర్ మున్సిపల్ పరిధిలోని యంనంపేట చౌరస్తాలో ఏర్పాటు చేసిన టీజీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్‌ని శనివారం ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య యాదవ్, చెంగిచర్ల డిపో మేనేజర్ కవితతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఘట్‌కేసర్ చుట్టుపక్కల గ్రామాల వాసులు ఈ టీజీఎస్ఆర్టీసీ సదుపాయాలను ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ గొద్రేజ్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గొద్రేజ్ ఇండస్ట్రియల్ ఏరియా ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ తెలిపారు.

ఘట్‌కేసర్‌లో..

ఘట్‌కేసర్: కొండాపూర్ 33/11 కేవీ సబ్‌స్టేషన్ 11కేవీ కొండాపూర్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ బలరాం తెలిపారు. ఆదివారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4:30 వరకు కొండాపూర్ ఏజీఎల్, సత్తిరెడ్డి ఏజీఎల్ ప్రాంతం, మాధవరెడ్డి బొమ్మ ఏజీఎల్ ప్రాంతం, అర్చన సోలార్ ఏజీఎల్ ప్రాంతం, జిడ్డు కృష్ణమూర్తి ఏజీఎల్ ప్రాంతంల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నేటి నుంచి గ్రూపు-3 పరీక్షలు

సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి సోమవారం వరకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో నిర్వహించనున్న గ్రూప్-3 పరీక్షలకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లాలో మొత్తంగా 115 పరీక్షా కేంద్రాలలో 65,361 మంది అభ్యర్థుల హాజరు కానుండటంతో అందుకు అనుగుణంగా పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులను కల్పించినట్లు జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. గ్రూపు-3 పరీక్షలు రెండు సెషన్లుగా జరుగనున్నాయి. పేపర్-1, ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, పేపర్-2, మధాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఉంటుంది. ఈ నెల 18న పేపర్-3 పరీక్ష ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు నిర్వహిస్తారని కలెక్టర్ పేర్కొన్నారు. ముందస్తు సెషన్‌కు సంబంధించి అభ్యర్థులు ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం సెషన్‌కు సంబంధించి మధ్యాహ్నం 1.30 గంటల నుంచి పరీక్షా కేంద్రం లోపలికి అనుమతిస్తారన్నారు. పరీక్షా కేంద్రం ప్రధాన గేట్‌ను ముందస్తు సెషన్‌కు ఉదయం 9.30 గంటలకు, మధ్యాహ్నం సెషన్‌కు సంబంధించి మధ్యాహ్నం 2.30 గంటలకు మూసివేస్తారన్నారు. గేట్లు మూసివేసిన తర్వాత అభ్యర్థులెవ్వరిని పరీక్షా కేంద్రంలోకి అనుమతించరని తెలిపారు. పరీక్షలకు సంబంధించి మొదటి సెషన్‌కు ఉపయోగించిన హాల్ టికెట్ కాపీని మిగిలిన సెషన్‌లకు ఉపయోగించాలని కలెక్టర్ సూచించారు. తుది ఎంపిక ప్రక్రియ పూర్తయ్యే వరకు అభ్యర్థులు తప్పనిసరిగా హాల్ టికెట్లు, అన్నీ సెషన్‌ల ప్రశ్నా పత్రాలను భద్రపరచుకోవాలని సూచించారు. ఏదైనా సాంకేతిక సమస్యలు ఉన్నట్లయితే అభ్యర్థులు టీజీపీఎస్సీ టెక్నికల్ హెల్ప్ డెస్క్ ఫోన్ నెంబర్లు 040-23542185 లేదా 040-23542187లో సంప్రదించవచ్చన్నారు. హెల్ప్ డెస్క్‌ను పని దినాలలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం1.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించవచ్చని జిల్లా కలెక్టరు గౌతమ్ తెలిపారు.

సర్వే పత్రాల భద్రతలో నిర్లక్ష్యం వహించొద్దు



పూడూర్‌లో సర్వే ప్రొఫార్మాలను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతం పొట్రు



రాజబొల్లారంలో అధికారుల నుంచి వివరాలు సేకరిస్తున్న కలెక్టర్



శామీర్‌పేట్‌లో సర్వే తీరును పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్‌రూరల్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఎన్యుమరేటర్లు పూరించిన ప్రొఫార్మాలను ప్రతిరోజు పెట్టెలలో పెట్టి కార్యాలయాలలో భద్రపరచాలని, ఏమాత్రం నిర్లక్ష్యాన్ని సహించేది లేదని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం పొట్రు అన్నారు. శనివారం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా మండలంలోని రాజబొల్లారం, పూడూర్ గ్రామాలలో ఎన్యుమరేటర్లు నిర్వహిస్తున్న కుటుంబాల సర్వే వివరాల సేకరణను కలెక్టర్ పరిశీలించారు. సర్వే సాగుతున్న తీరును అధికారులను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సర్వేలో ఏమైనా సమస్యలు తలెత్తుతున్నాయా అని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతీ రోజు ఎన్యుమరేటర్లు పూరించిన ప్రొఫార్మాలను కార్యాలయాల్లో భద్రపరచాలని, ఏమాత్రం నిర్లక్ష్యాన్ని సహించేది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్యుమరేటర్ల నమోదు ప్రక్రియ పూర్తైన వెంటనే ఆపరేటర్ల ద్వారా కంప్యూటర్లలో అప్‌లోడ్ చేయించాలని ఎంపిడిఓలకు సూచించారు. ఎన్యుమరేటర్లు దగ్గరుండి ఆపరేటర్ల ద్వారా తప్పులు జరగకుండా జాగ్రత్తగా ఆప్‌లోడ్ చేయించాలన్నారు. ప్రొఫార్మాల నమోదులో ఏలాంటి తప్పులు జరుగకుండా చూసుకోవాలని, ఎన్యుమరేటర్లు పూరించిన ప్రొఫార్మాలను సూపర్‌వైజర్లు, నోడల్ అధికారులు తప్పకుండా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శైలజ, ఎంపిడిఓ వసంతలక్ష్మి, సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

వివరాల నమోదులో తప్పులు దొర్లకుండా చేయాలి

శామీర్‌పేట్: సమగ్ర ఇంటింటి సర్వే నమోదులో ఎలాంటి తప్పులు దొర్లకుండా ఎన్యుమరేటర్లు పత్రాలలో నమోదు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సూచించారు. శనివారం శామీర్ పేట్‌లో ఎన్యుమరేటర్లు నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించిన ఆయన అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుటుంబ వివరాల సేకరణ, నమోదు ప్రక్రియలో జాగ్రత్తగా ఉండాలని, తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. ప్రొఫార్మాలను ఎప్పటికప్పుడు జాగ్రత్తగా భద్రపరచాలని సూచించారు. అంతకుముందు శామీర్‌పేట్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో తహసీల్దార్ యాదగిరిరెడ్డి, ఎంపీఓ వినూత్న, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.